ప్రజాశక్తి
గురువారం 22, డిసెంబర్ 2022



జెసి ఇంట సిబిఐ సోదాలు

అనంతపురం : మాజీ పార్లమెంటు సభ్యులు జెసి.దివాకర్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో సిబిఐ అధికారులు బుధవారం నాడు సోదాలు నిర్వహించారు. వారి అనునాయుడు జఠాధర సంస్థ ప్రతినిధి సి.గోపాల్‌రెడ్డి నివాసంలోనూ సోదాలు చేపట్టారు. బిఎస్-3 వాహనాలను బిఎస్-4 తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణను చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరు దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు సిబిఐ కూడా రంగంలోకి దిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం నాడు సిబిఐ తాడిపత్రి పట్టణంలో జెసి సోదరుల నివాసంలో తనిఖీలు చేపట్టారు. అయితే ఈ తనిఖీలకు వచ్చిన సమయంలో అటు జెసి సోదరులు గాని, ఇటు గోపాల్‌రెడ్డి గాని ఇక్కడ లేరు. జెసి.దివాకర్‌రెడ్డి ఇంట వివాహ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో వారు ఇక్కడ లేరు. దీంతో కార్యాలయాల్లో పరిశీలించి వెళ్లిపోయారు.



మహా సభలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ముగిసిన మున్సిపల్ వర్కర్స్ మహాసభలు


తీర్మానాలకు అమోదం తెలుపుతున్న సభ్యులు

రాష్ట్ర అధ్యక్షులుగా నాగభూషణం రాష్ట్ర కమిటీకి నాగరాజు ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహసభలు బుధవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన మహాసభలో ఉత్తేజపూరిత వాతావరణంలో నడిచాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో జరుగుతున్న నష్టాల గురించి చర్చించారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు ఎన్నికలకు ముందు హామీలిచ్చి తరువాత విస్మరించిన తీరును ఎండగట్టారు. సమాన పనికి సమాన వేతనమిస్తామని చెప్పి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉదోగ్యులను రెగ్యులరైజ్ చేయకపోవడాన్ని ఎండగట్టారు. ఎప్కాస్ విధానం పేరుతో ఉద్యోగులుగా గుర్తించామని ప్రకటించి ఉద్యోగులకు వర్తించే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ గాని, పెన్షన్ గాని లేకుండా చేయడాన్ని మహాసభ తప్పుబట్టింది. రెండు రోజుల పాటు ఆయా జిల్లాల వారీగానున్న ప్రత్యేక సమస్యలపైనా ఇందులో చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు ఎంతో అవసరమని మొదటి రోజు జరిగిన చర్చల్లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నరసింగరావు సూచించారు. రెండో రోజు జరిగిన చర్చల్లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొని దిశానిర్ధేశం చేశారు. సమస్యలపై అందరినీ కలుపుకుని పోరాటం చేయడమే కాకుండా సొంతబలాన్ని పెంచుకోవడంపైనా దృష్టి సారించాల్సిన అవసరముందని ధనలక్ష్మి రెండు రోజులపాటు జరిగిన మహాసభలో పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది అంశాలపై రెండు రోజుల మహాసభల్లో తీర్మానాలు ప్రవేశపెట్టారు. వీటిని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. మొత్తంగా రెండు రోజులపాటు జరిగిన మహాసభలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

ఇద్దరికి రాష్ట్ర కమిటీలోచోటు

ఎపి మున్సిపల్ అవర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన రాష్ట్ర కమిటీలో అనంతపురం జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాష్ట్ర అధ్యక్షులుగా నాగభూషణం ఎన్నికయ్యారు. మున్సిపల్ వర్కర్సు అండ్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయన ఉన్నారు. జిల్లా అధ్యక్షులుగానున్న నాగరాజు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

చితికిపోతున్న లారీ పరిశ్రమ..

'హిందూపురం పట్టణంలో నివాసముంటున్న సత్తార్ సాబ్ ఫైనాన్స్ చేసి దాదాపు ఐదు లారీలను ఏర్పాటు చేసుకుని 20 మంది కార్మికులకు ఉపాది నిచ్చారు. పెరిగిన ధరల వల్ల పూర్తిగా నష్టపోయాడు. ఉన్న లారీలను అమ్మి అప్పులు తీర్చాడు. మిగిలిన డబ్బుతో పరిగి బస్టాండ్ వద్ద కోడిగుడ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు'.

'బాబు అనే లారీ ఓనర్ ఉన్న లారీలను అమ్ముకుని మున్సిపల్ కార్యాలయం ముందు పాన్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషి స్తున్నాడు.. ఇదే విధంగానే చలపతి, నాగరాజు, సిద్దిక్ ఎంతో మంది లారీల యజమానులు నేడు పెరుగుతున్న డిజిల్ ధరలు, టోల్ ఛార్జీలతో బాడుగలు గిట్టుబాటు కాక ఉన్న లారీలను అమ్ముకున్నారు. చేసిన అప్పులను తీర్చి.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు'.

ప్రజాశక్తి-హిందూపురం

దక్షిణ భారతదేశంలోనే హిందూపురం లారీ పరిశ్రమకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి నిత్యం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, కేరళ, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఇక్కడ ఉత్పత్తి అయిన బర్జర్, బ్రిటిష్ పెయింట్స్, విప్రో, స్టీల్, ప్యాకింగ్ పేపర్ వివిధ రకాల సరుకులు ఎగుమతి అవుతుంటాయి. అక్కడి నుంచి వివిధ రకాల సరుకులు హిందూపురంతో పాటు పక్కన ఉన్న బెంగళూరుకు దిగుమతి అవుతుంటాయి. దీంతో ఎంతో మంది ఫైనాన్స్ తీసుకుని లారీలను ఏర్పాటు చేసుకున్నారు. వీరితో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పించారు. అయితే కేంద్ర ప్రభుత్వ విధానాలు, కరోనా కాలంలో ఎదురైన నష్టాలతో అనంతపురం ఉమ్మడి జిల్లాలో లారీ పరిశ్రమ పూర్తిగా కుదేలయింది. డీజిల్, టోల్ గేటు, బాడుగల ధరలు పెరగక పోవడంతో లారీ రంగంలో పనిచేసే వారంతా వేర్వేరు రంగాలకు వలస వెళ్లిపోతున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో డీజిల్ ధరలు పెరిగిన స్థాయిలో కిరాయిలకు బాడుగలు పెరగడం లేదు. పెట్టుబడి కోసం అప్పుచేసి తెచ్చిన డబ్బుకు వస్తున్న ఆదాయం వడ్డీ కట్టేందుకు కూడా గిట్టుబాటు కావడం లేదు. బ్యాంకులు, ప్రయివేటు ఫైనాన్స్‌లో తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుండడంతో భయంతో యజమానులు లారీలను నష్టాలకు అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు నాలుగైదు లారీలతో దర్జాగా బతికిన వారు సైతం వాటిని తెగనమ్ముతున్నారు. తెచ్చిన అప్పులు తీరక బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌లు వేసిన కేసులతో కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నారు. పెద్దఎత్తున లారీలను తెగనమ్ముకోవడంతో ఈ పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది. ఒకప్పుడు లారీలతో కళకళలాడిన హిందూపురం నేడు వెలవెలబోతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

రోడ్డున పడిన ఓనర్లు, కార్మికులు ఆదుకోకపోతే పరిశ్రమ కనుమరుగు

డీజిల్ ధర పెరిగినా పెరగని బాడుగలు

2016లో డీజిల్ ధర రూ.52.28, బాడుగ టన్నుకు రూ.1300 ఉండేది. నేడు డీజిల్ రూ.99.58, బాడుగ రూ.1350 ఉంది. అంటే ఆరేళ్లలో డీజిల్ ధర రూ.47.30 పెరగగా బాడుగ ధర మాత్రం టన్నుకు రూ.50 రూపాయలు మాత్రమే పెరిగింది. తరచుగా పెరుగుతున్న డీజిల్ ధరలతో ఒక్కో లారీ యజమాని నెలకు వేలకు వేలు అదనంగా నష్టపోతున్నాడు. సాధారణంగా ఒక్కో లారీ నెలకు 3 వేల కిలోమీటర్లు తిరుగుతోంది. దీన్ని బట్టి చూస్తే పెరిగిన డీజిల్ ధరలకు పెరగని బాడుగల వల్ల నెలకు లారీపై రూ.50 వేల వరకు నష్టం వాటిల్లుతోంది.

ఈ మధ్యకాలంలో టోల్‌గేటు ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గతంలో ఉన్న టోల్‌గేటు ధరలకు అదనంగా రూ.60 నుంచి రూ.200 వరకు పెరిగాయి. రోడ్లను బట్టి టోల్ ధరలు కూడా ఉంటున్నాయి. పెరిగిన టోల్ ధరలు లారీ యజమానులకు భారంగా మారాయి. ధరలు తగ్గించాలని ఆందోళనలు సైతం చేపట్టారు. ఏడాదికి టోల్‌ల సంఖ్యకూడా పెరిగింది. పదుల సంఖ్యలో పెరుగుతున్న టోల్ గేట్‌ల వల్ల నెలకు ఒక్కొక్క లారీకి రూ.10 నుంచి రూ.15 వేల వరకు భారం పడుతోంది. మరోవైపు టైర్ల ధరలు కూడా పెరుగుతున్నాయి. నెలరోజుల క్రితం రెండు టైర్లు రూ.42 వేలు ఉండగా ప్రస్తుతం రూ.48 వేలు దాటాయి. సాధారణంగా టైర్ల జీవిత కాలం 80 వేల కిలోమీటర్లు. కానీ రోడ్డు దెబ్బతినడం వల్ల ఎప్పుడు పగిలిపోతాయోననే భయం యజమానుల్లో ఏర్పడుతోంది.



బాడుగలు గిట్టుబాటు గాక హిందూపురంలో నిలిపివేసిన లారీలు

గ్రీన్ ట్యాక్స్ పేరుతో మరో దోపిడీ..

గ్రీన్ ట్యాక్స్ పేరుతో ప్రభుత్వం లారీ యజమానులను నిలువుదోపిడీ చేస్తోంది. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరలు, పెరగని బాడుగలతో సతమతమవుతుంటే అదనంగా గ్రీన్ ట్యాక్స్‌ను వసూలు చేస్తుండటంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలకు ఒకసారి 12, 14 టైర్ల లారీలకు రూ.12,500, 16 టైర్ల లారీలకు రూ.15000 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 వేలకు పైగా లారీలు ఉండేవి. ఆహార ఉత్పత్తులతో పాటు ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సరుకులు అధిక శాతంగా ఉమ్మడి జిల్లా నుంచి ఎగుమతులు, దిగుమతులు జరిగేవి. ఈ రంగంలో యజమానులే డ్రైవర్లుగా ఉపాధి పొందే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. కరోనా తగ్గుముఖం పట్టినా పెరిగిన డీజిల్ ధరలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన 12 నెలల్లో బ్యాంకులకు కంతులు చెల్లించలేక ఫైనాన్స్ కంపెనీలు వదిలేసిన యజమానులు పదుల సంఖ్యలో ఉన్నారు.

ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలకు రాయితీలు ఇచ్చి వారు బ్యాంకుల్లో చేసిన రూ.కోట్ల అప్పులను రద్దుచేసి మరీ ఆదుకుంటున్నారు. అయితే ప్రగతి చిహ్నాలుగా పేరొందిన లారీ పరిశ్రమను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయి. పెరుగుతున్న డీజిల్ ధరలతో పాటు పెరుగుతున్న టోల్ గేట్‌లతో పాటు తర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ప్రతి మూడు నెలలకు ఒక సారి ట్యాక్స్, ప్రతి ఏడాది ఎఫ్‌సి ఇతర ఖర్చుల వల్ల లారీలు నడుపాలంటే యజమానులకు ధైర్యం చాలడం లేదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచన చేసి లారీ పరిశ్రమను ఆదుకోక పోతే భవిష్యత్తులో పరిశ్రమ కనుమరుగు అవుతుంది.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి

కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ విద్యార్థులకు బైజుస్ ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లాలోని ఎడ్లపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కెఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలోని అన్నే ఫెర్రర్ ఆడిటోరియం నందు జిల్లా వ్యాప్త ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ చదువు ఖర్చు పిల్లల తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వం అమ్మఒడి రూపంలో నేరుగా డబ్బులు, విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, గోరుముద్ద ద్వారా మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తోందన్నారు. వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసి రెండు విడతల్లో నాడు-నేడు పనుల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోందన్నారు. కరోనా కారణంగా తగ్గిపోతున్న విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయలకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చామన్నారు. ఎన్ని చేసినా అంతిమ కొలమానం పరీక్షల్లో విద్యార్థుల ఫలితాలేనన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో కల్పించిన మౌలిక వసతులను వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించేలా చదువులు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు, ఆర్థిక సమస్యలున్నా మీ వెనక నేనున్నాను మీ పిల్లలను చదివించండి అంటూ తల్లిదండ్రులకు భరోసా ఇస్తున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కరోనా తర్వాత డిజిటల్ విద్యకు ప్రాధాన్యత పెరిగిన నేపథ్యంలో బైజుస్ వారి సహకారంతో ఇన్ బిల్ట్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందించి విద్యార్థులను పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేస్తున్నామన్నారు. పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. విద్యా ప్రదాత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాల్సిందిగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరగా.. విద్యార్థులు ముక్త కంఠంతో 'థాంక్యూ సిఎం సార్' అని శుభాకాంక్షలు తెలిపారు. పేద విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ట్యాబ్‌లు అందిస్తున్నామని పాఠశాల విద్య ఆర్‌జెడి, ఇన్‌ఛార్జి డీఈవో వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నేటి నుంచి వారం రోజుల పాటూ జిల్లా వ్యాప్తంగా 25,920 ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆహుడా ఛైర్ పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి లక్ష్మీ సాహితి, కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, రజక కార్పొరేషన్ ఛైర్ పర్సన్ మీసాల రంగన్న, సమగ్ర శిక్ష ఎపిసి కె.తిలక్ విద్యాసాగర్, అనంతపురం డిప్యూటీ డివైఇఒ పద్మప్రియ, ఎంఇఒ వెంకట స్వామి, డిఇఒ ఆఫీస్ ఎఎస్‌ఒ ఓబులరెడ్డి, డిసిఇబి సెక్రెటరీ లోకేశ్వర్‌రెడ్డి, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా సైన్స్ అధికారులు బాలమురళీకృష్ణ, ఆనంద భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎఎంఒ మాధవరెడ్డి, పలు పాఠశాలల హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘసంస్కర్త కందుకూరి

ప్రజాశక్తి-అనంతపురం

సమాజంలోనున్న రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కకర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని వక్తలు పేర్కొన్నారు. ఐద్వా, ఎస్ఎఫ్ఐ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ప్రజా నాట్యమండలి, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక బహుజన సాంస్కృతిక ఉత్సవాలు బుధవారం మూడవ రోజూ అలరించాయి. 'ఖడ్గధారి కందుకూరి' అన్న పేరుతో కందుకూరి విరేశలింగం పంతులు జీవితం ఆధారంగా ఈ నృత్యరూపకాన్ని అభ్యుదయ అకాడమీ కళాకారులు చక్కగా ప్రదర్శించి చూపించారు. మహిళల హక్కుల కోసం ఆయన ఏ రకంగా కృషి చేశారు.. అదే విధంగా విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని చాటి చెప్పారు. ఆనాటి సమాజంలోనున్న అనేక రుగ్మతలను పారదోలేందుకు ఆయన చేసిన కృషి, అందులో ఎదురైన ఆనేక ఇబ్బందులను ప్రదర్శనలో కళ్లకు కట్టినట్టు చూపించారు. వరుసగా మూడు రోజులు సాగుతున్న ఈ సాంస్కృతిక ఉత్సవాలకు విశేషమైన ఆధరణ లభిస్తోంది. పెద్దఎత్తున ప్రేక్షకులు విచ్చేసి ప్రదర్శనలు తిలకిస్తున్నారు. మాహనీయుల జీవిత చరిత్రను తెలియజేసే విధంగా ప్రదర్శన ఉండటమే కాకుండా ఆనాటి సామాజిక పరిస్థితులు, వారు ఏ రకంగా మూఢ విశ్వాసాలను పారదోలేందుకు ప్రయత్నించారన్నది తెలియజేసే విధంగా సాగుతున్నాయి. దీంతో ఇటువంటి కార్యక్రమాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అక్కడికి తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులు, పురప్రముఖులు చెబుతున్నారు.

అలరించిన సాంస్కృతిక ఉత్సవాలు

మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయి మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్

విద్యార్థుల మానసిక వికానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్ పేర్కొన్నారు. మూడవ రోజు జరుగుతున్న సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి సామాజిక పరిస్థితుల్లో మహనీయులు ఏ రకంగా సమాజ మార్పుకు కృషి చేశారన్నది ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఇప్పటి తరం తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, రిటైర్డు డిప్యూటీ కలెక్టరు గోవింద రాజులు, మానవతా రక్తదాత సంస్థ ప్రతినిధి తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం నాయకులు షేక్ నబీరసూల్, మెడికల్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు మనోహర్, ఐద్వా నాయకులు రాజేశ్వరి, రామాంజినమ్మ, కెవిపిఎస్ నాయకులు నల్లప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యచంద్ర, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న మానసిక వైద్యులు ఎండ్లూరి ప్రభాకర్


నాటకంలో ఓ సన్నివేశం


సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన విద్యార్థులు, ప్రజలు

నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సిసిఎం ఆధ్వర్యంలో విడపనకల్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలోని దాదాపు 15 మండలాల్లో రైతులు మిర్చి, వరి, మిరప, వేరుశనగ, జొన్న, పత్తి తదితర పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయికి వెళ్లి నష్టపోయిన పంట వివరాలను నమోదు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కౌలు రైతులు ముందస్తు కౌలుకు చెల్లించడంతోపాటు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే వర్షాల వల్ల తీవ్ర నిరాశే ఎదురైందన్నారు. నష్టపోయిన రైతులందరితోపాటు కౌలు రైతులకు కూడా ఎకరాక రూ.50 వేలు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వన్నప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, మండల నాయకులు శ్రీనివాసులు, మాబూ, విజయ్, రైతులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

టీచర్ల బదిలీ దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 7,640 దరఖాస్తులను బుధవారం నగరంలోని జిల్లా సైన్ సెంటర్‌లో పరిశీలించారు. ఈ దరఖాస్తులను 12 టీంలను ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నారు. పరిశీలన ప్రక్రియ ముగిసిన తర్వాత సీనియార్టీ జాబితాను తయారు చేయనున్నారు. అదేవిధంగా సందేహాలను నివృత్తి చేయడానికి కూడా టీంని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తర్వాత జీవోలోని షెడ్యూల్ ప్రకారంగా బదిలీల ప్రక్రియను పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తామని ఆర్‌జెడి, ఉమ్మడి అనంతపురం జిల్లా డిఇఒ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.



చీపురుతో ఊడుస్తున్న సర్పంచి గురుమస్తాన్

చీపురు పట్టిన సర్పంచి

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో సర్పంచి ఆర్.గురుమస్తాన్ బుధవారం స్వయానా చీపురు పట్టి వీధులను శుభ్రం చేశారు. సిఎం జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో తామే స్వయంగా శ్రమదానం చేసినట్లు సర్పంచి తెలిపారు.

ప్రాంతీయ భాషల్లోకి డిప్లొమా, బిటెక్ పాఠ్యపుస్తకాలు

ఎఐసిటిఇ ఫ్యాకల్టీ డైరెక్టర్ దినేష్‌సింగ్

ప్రజాశక్తి-అనంతపురం

ఇక నుంచి అన్ని ప్రాంతీయ భాషల్లోకి డిప్లొమా, బిటెక్ పాఠ్యపుస్తకాలను అనువాదం చేయనున్నట్లు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) ఫ్యాకల్టీ డైరెక్టర్ డాక్టర్ దినేష్‌సింగ్ తెలిపారు. బుధవారం స్థానిక జెఎన్‌టియులోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో అనంత జెఎన్‌టియు, ఎఐసిటిఇ సంయుక్తంగా సాంకేతిక పాఠ్య పుస్తకాలను తెలుగులోకి అనువధించే అనువాదకులకు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని జెఎన్‌టియు విసి జి.రంగజనార్ధన, డైరెక్టర్ దినేష్‌సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐసిటిఇ ఆంగ్లభాషలో ఉన్న పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లోకి అనువదించడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా పాఠ్య పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో అనువదిస్తే విద్యార్థులకు వారి వారి మాతృభాషల్లో అర్థం చేసుకోవడానికి వీలవుతుందన్నారు. దీనివల్ల విద్యార్థులకు సబ్జెక్టుల్లో మరింత జ్ఞానం పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. విసి మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యాసంస్థ ప్రాంతీయ భాషల్లో పాఠ్య పుస్తకాలను అనువదించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. అంతేకాకుండా తెలుగు భాషలోకి అనువదించడానికి తెలుగు రాష్ట్రాల్లో అనంత జెఎన్‌టియును నోడల్ సెంటర్‌గా ఎంపిక చేసినందుకు ఎఐసిటిఇ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, మెంబర్ సెక్రటరీ, ప్రొఫెసర్ మమత అగర్వాల్, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, యూనివర్సిటీ ఫ్యాకల్టీ డైరెక్టర్ పి.ఆర్.భానుమూర్తి, యూనివర్సిటీ కోఆర్డినేటర్ కె.శేషమహేశ్వరమ్మ, పిఆర్ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి, 52 మంది శిక్షణ అనువాదకులు, యూనివర్సిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎఐసిటిఇ ఫ్యాకల్టీ డైరెక్టర్ దినేష్‌సింగ్‌ను సన్మానిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

23 నుంచి వసతి గృహాల్లో నిద్ర

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఈనెల 23, 24, 25వ తేదీల్లో హాస్టళ్లలో నిద్ర చేయనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, జిల్లా అధ్యక్షుడు శివ తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా వాస్తవ పరిస్థితుల్లో కనిపించడం లేదన్నారు. ముఖ్యంగా జిల్లావ్యాప్తంగా ఉన్న వెనుకబడిన వర్గాల బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో కనీసం మంచినీరు, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేవన్నారు. ఈనేపథ్యంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 23, 24, 25వ తేదీల్లో హాస్టళ్లలో నిద్ర చేసి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వైటిసి రమేష్, సిద్ధార్థ, ఎస్‌కెయు గిరి, సూర్యప్రకాష్, వెంకీ, వరుణ్, అశోక్, రుషి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-ఉరవకొండ

క్షయ వ్యాధి నివారణ ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాకెట్ల పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, డబ్ల్యుహెచ్‌ఒ కన్సల్టెంట్ డాక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్మూలించాలనే ఉద్దేశంతో 2023 జనవరి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించే విధంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మహేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి.రఫీ, ఎస్‌టిఎల్‌ఎస్ కుళ్లాయమ్మ, ఎఎన్‌ఎం పద్మావతి, కమ్యూనిటీ ఆర్గనైజర్ భగవాన్‌దాస్, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

ఆత్మకూరు : జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని బి.యాలేరు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు కలిసి క్షయ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ఇంటి వద్దే గళ్ల నమూనాలు సేకరించారు. గళ్ల పరీక్షల రిపోర్టు వచ్చిన తర్వాత అవసరైమన వారికి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి నివారణ జిల్లా అధికారి డాక్టర్ అనుపమ, ఎంపిహెచ్‌ఇఒ నాగేశ్వరయ్య, టి.బి సూపర్‌వైజర్లు నిర్మల, శ్రీనివాస్, ఎఎన్‌ఎం ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పి జ్యోతి, ఆరోగ్య కార్యకర్త బాపూజీనాయక్, ఆశా, వాలంటీర్లు, పాల్గొన్నారు.

మండల యానిమేటర్లతో సమీక్ష

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల కేంద్రంలోని వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో బుధవారం మండలంలోని యానిమేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి ఎపిఎం నీలమణి మాట్లాడుతూ మండలంలోని నాలుగు క్లస్టర్ల పరిధిలో 38 గ్రామైక్య సంఘాలు, 1,080 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం జగనన్న తోడుకు సంబంధించి 345 మంది లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించామన్నారు. తక్కిన 167 మందికి ఈ పథకం వర్తించేటట్లు చూస్తామన్నారు. వీటితోపాటు 10 సంఘాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సీసీలకు సూచించారు. మొబైల్ బుక్‌కీపింగ్ ఎప్పటికప్పుడు చేసుకోవాలన్నారు. అలాగే శ్రీనిధికి సంబంధించి 14 గ్రామ సంఘాలకు ఎన్‌పిఎ అకౌంట్‌కు వెళ్లాయన్నారు. రికవరీ పెంచితే తప్ప నూతన రుణాలకు అవకాశం లేదన్నారు. సిఐఎఫ్ సంబంధించి ఆల్ రికవరీస్ జరుగుతున్నాయన్నారు. వీటితోపాటు మండలానికి 100 యూనిట్ల పెరటి కోళ్ల పెంపకానికి తమ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న తోడుకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను సంబంధిత యూనియన్ బ్యాంకు వేపులుపర్తి, కెనరా బ్యాంకుకు దరఖాస్తు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సిసి సి.కామరాజు, సీసీలు శివప్రసాద్, ధోనతిమ్మ, నరసింహ, ఎంఎస్ అకౌంటెంట్ ప్రతాప్, యానిమేటర్లు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐకెపి ఎపిఎం నీలమణి

ఎపిలో విద్య దేశానికి ఆదర్శం..

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న డిజిటల్ విద్య దేశానికే ఆదర్శమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఉరవకొండ సెంట్రల్ హైస్కూలులో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలకు సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఉచిత ట్యాబ్‌లు పంపిణీ చేసి డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, మనబడి-నాడునేడు, గోరుముద్ద, వైఎస్ఆర్ పోషణ, ఉచిత ట్యాబ్‌లు పంపిణీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మంచి చదువులు అందించాలన్నదే సిఎం ఆకాంక్ష అన్నారు.



విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కష్టపడిన వారికే టికెట్ ఇవ్వాలి

శైలజానాథ్‌కు ఇస్తే వ్యతిరేకిస్తాం..: శింగనమల టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికే శింగనమల ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు చిదానందనాయుడు, చితంబరి దొర, పొడరాల రవీందర్‌రెడ్డి, గుర్రం లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ పార్టీ పటిష్టత కోసం కష్టపడే వారికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు. అధిష్టానం కూడా ఆ దిశగానే అలోచిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం దిశగా శ్రమిస్తున్న బండారు శ్రావణిశ్రీకి టికెట్ కేటాయిస్తే కలిసికట్టుగా పోరాడి గెలిపిస్తామన్నారు. అయితే మాజీమంత్రి శైలజానాథ్‌కు టిడిపి టికెట్ ఖరారైందని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఒకవేళ ఆయనకే టికెట్ కేటాయిస్తే టిడిపి నాయకులతోపాటు కార్యకర్తలంతా ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, అట్టే చౌడప్ప, సి.వెంకటేష్, రహంతుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27 నుంచి మెడికల్ క్యాంపులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఉపకరణాల పంపిణీ కోసం మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించన్నట్లు ఆర్‌జెడి, వెంకటకృష్ణారెడ్డి, సమగ్ర శిక్ష కె.తిలక్ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న గుత్తి భవిత సెంటర్‌లో గుత్తి డివిజన్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు వజ్రకరూరు మండలాలకు, 28న తాడిపత్రి భవిత సెంటర్‌లో తాడపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాలు, 29న కళ్యాణదుర్గం భవితసెంటర్‌లో కళ్యాణదుర్గం, బెలుగుప్ప, బ్రహ్మసముద్రం, కుందుర్పి, శెట్టూరు మండలాలు, 30న రాయదుర్గం భవిత సెంటర్‌లో బొమ్మనహాల్, గుమ్మగట్ట, కనేకల్, రాయదుర్గం, డి.హీరేహాల్ మండలాలు, 31న అనంతపురం భవిత సెంటర్‌లో అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, కూడేరు, నార్పల, రాప్తాడు, శింగనమల, ఉరవకొండ, విడపనకల్లు మండలాలకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో విభిన్న ప్రతిభవంతులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28 నుంచి క్రీడాపోటీలు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-తాడిపత్రి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 28వ తేదీ నుంచి విద్యార్థులు, జర్నలిస్టులు, పోలీసులు, ఉపాధ్యాయులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వరుణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు కడప రోడ్డులో ఉన్న చర్చి స్కూల్ మైదానంలో తాడిపత్రి నియోజకవర్గస్థాయిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్..80084 32618ను సంప్రదించాలని కోరారు.

భూముల రీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని సింగామల్లి శ్రీధరగట్ట రెవెన్యూ గ్రామాల్లో రెండో విడత భూముల రీసర్వేను తహశీల్దార్ శ్రీనివాసులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రెవెన్యూ భూములను రీసర్వే చేసి భూతగాదాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వంద సంవత్సరాల క్రితం సర్వే చేసిన నేపథ్యంలో భూముల రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వీటిలో కొన్ని మార్పులు, చేర్పులు, ఇబ్బందులు కలిగిన వాటిని గుర్తించి అందరికీ తగిన న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రెండో విడతలో మండలంలోని నేమకల్లు, గోనేహాల్, సింగేపల్లి రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్, సర్వేయర్ రవితేజ, వీఆర్వోలు సుజాత, నరసింహమూర్తి, వినయ్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భూములను సర్వే చేస్తున్న అధికారులు

తాడిపత్రి పోలీస్ స్టేషన్ పనితీరు బాగోలేదు

డిఐజి రవిప్రకాష్

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పట్టణ పోలీస్ స్టేషన్ పనితీరు బాగోలేదని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది పనితీరు, కేసుల విచారణ, దొంగతనాలపై ప్రజలు ఎలా రక్షణ కల్పిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత 2020, 2021, 2022 సంవత్సరాలకు సంబంధించి కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఇందులో 85 శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్ని కేసులు విచారించకుండా మూసివేయడం ఏంటని ప్రశ్నించారు. ఎందుకు కేసులు విచారణ చేయలేదని ఇన్స్‌పెక్టర్లను అడిగారు. వెంటనే పెండింగ్ కేసులపై దృష్టి సారించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో దాదాపు 7, 8 కేసులు నమోదయాయని, వాటిని పూర్తి చేయాలని సిఐని ఆదేశించారు. స్టేషన్‌పరిధిలో 307 కేసులు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. 307 కేసుల్లోని ముద్దాయిలను వెంటనే అరెస్టు చేసి రౌడీషీట్ నమోదు చేయాలన్నారు. అలాగే పెట్టీ కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. 25 కేసులు ఛీటింగ్ కేసులు ఉన్నాయన్నారు. వీటిల్లో 50శాతం మాత్రమే విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను విచారించి నేరస్తులను చట్టం ముందు నిలబడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. 2020లో 700, 2021లో 800, 2022లో ఇప్పటివరకు 450 కేసులు నమోదయ్యాయని, ఇందులో 50 శాతం వరకు మాత్రమే విచారించినట్లు తెలుస్తోందన్నారు. అలాగే ఐడి, ఎక్సైజ్ శాఖలపై ప్రత్యేక దృష్టి అవసరం ఉందన్నారు. మొత్తంమీద తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్ పనితీరు బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలల తర్వాత మరోమారు తనిఖీ చేస్తానని, పనితీరులో మార్పు రావాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి రవి ప్రకాష్

నేరాలు ఘోరాలు



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో దగ్ధమైన ఇల్లు, కాలి బూడిదైన డబ్బులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..

ప్రమాదంలో రూ.15 లక్షల ఆస్తి నష్టం

ఉరవకొండ : పట్టణంలో నివసిస్తున్న చేనేత కార్మికుడు చంద్రనాథ్ ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో సుమారు రూ.15లక్షల ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో మంటలు చెలరేగి ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఏర్పాటు చేసుకున్న చేనేత మగ్గం, నేసిన 40 పట్టు చీరలతో పాటు రూ.5లక్ష నగదు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వీటితోపాటు ఇంట్లోని వస్తువులు, బీరువాల్లో దాచుకున్న బంగారు ఆభరణాలు కూడా పూర్తిగా కాలిపోయాయి. గమణించిన స్థానికులు, బాధితుడు చంద్రనాథ్ వెంటనే నీళ్ల చల్లి మంటలను ఆర్పేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. కాగా విషయం తెలుసుకున్న ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

గుంతకల్లు : పట్టణంలోని ఇందిరానగర్ పార్కు పక్కన మట్కా రాస్తున్న ఇద్దరిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మురహరిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో ఆకస్మిక దాడులు చేసి గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన షేక్ చాంద్‌బాషా, కొనకొండ్ల గ్రామానికి చెందిన వడ్డే మురళీకృష్ణ పట్టణంలోని ఇందిరానగర్ పార్కు పక్కన మట్కా రాస్తుండగా అందుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.70,080, మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

రైతులు ఇకెవైసి చేయించుకోండి

బ్రహ్మసముద్రం : మండలంలో పిఎం కిసాన్ అందని రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ సరిత కోరారు. ఈమేరకు బుధవారం మండల పరిధిలోని సంతే కొండాపురం, పాలవెంకటాపురం రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రబీ పంటలు వేసిన రైతులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 3787 మంది ఈక్రాప్ బుకింగ్ చేయించుకోలేదన్నారు. వీరంతా డిసెంబర్ 31వ తేదీలోపు చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవన్నారు.

నాడు-నేడు పనులపై అధికారుల నిర్లక్ష్యం తగదు

శింగనమల : మండల వ్యాప్తంగా పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులపై అధికారుల నిర్లక్ష్యం తగదని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని రాచేపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి నత్తనడకన సాగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా నాడు-నేడు పనులు మొదలై రెండు నెలలు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్లను వివరణ కోరగా ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని వాపోతున్నారన్నారు. సలహాదారుల కోసం సంవత్సరానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్న సిఎం విద్యార్థులకు కనీస అవసరాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా అమ్మఒడి పేరుతో తల్లుల ఖాతాల్లో వేస్తున్న మొత్తంలో రెండు పర్యాయాలు పాఠశాలల మెయింటినెన్స్ కోసం రూ.3వేలు వసూలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రదీప్, రఘు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే బెస్తల నినాదం

గార్లదిన్నె : రాజ్యాధికారమే ధ్యేయంగా బెస్త కులస్తుందరం పనిచేద్దామని బెస్త సంఘం మండల అధ్యక్షుడు గడ్డం భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని అమృత స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతిఒక్కరూ బెస్త కులస్తుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అందరికీ చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్నాళ్లు రాజకీయ పార్టీలు బెస్త కులస్తులను కేలం ఓటుబ్యాంకుగా చూస్తున్నాయన్నారు. బెస్తలకు సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం ప్రధాన కార్యదర్శి రాజు, గౌరవాధ్యక్షులు చెన్నప్ప, సుధాకర్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విరాళం

గుత్తి : పట్టణంలోని కొత్తూరులో ఉన్న స్వీట్ సేవియర్ ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన వృద్ధ, అనాథాశ్రమానికి వైసిపి నాయకుడు హరి, జిరాక్స్ యజమాని వై.రామసుబ్బారెడ్డి బుధవారం విరాళం అందజేశారు. సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం ఆశ్రమంలో భవన పెయింటింగ్ పనుల కోసం రూ.10 విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వార్డెన్ మల్లికార్జున, వైసిపి నాయకులు కొనకొండ్ల సూరి, బెల్ బాషా, మురళి, ఇమ్రాన్, సులేమాన్, డాక్యుమెంట్ రైటర్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శింగనమల విద్యార్థులు

శింగనమల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నందకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలుర, బాలికల వెయిట్ లిఫ్టింగ్ ఎస్‌జిఎఫ్ ఎంపికలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.ఇమ్రాన్ అలీ బంగారు పతకం, అఖిల్‌కుమార్ కాంస్య పథకం సాధించినట్లు తెలిపారు. వీరిలో ఎం.ఇమ్రాన్‌అలీ మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ అభినందించారు.

జెఎన్‌టియు ఆధ్వర్యంలో 'సేవ్ లైఫ్'

అనంతపురం : సిఎం జగన్ జన్మదిన సందర్భంగా అనంతపురం జెఎన్‌టియులో ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధికారి సూచన మేరకు బుధవారం సేవ్‌లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి రంగజనార్ధన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు సుమారు 700 మంది ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ వి.సుమలత, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎస్.శారద తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు పరీక్షల భవన నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో పరీక్షల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి ఎం.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 5600 చదరపు అడుగుల్లో మూడు ఫ్లోర్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈభవనంలో ఒకేసారి 800 మంది పరీక్ష రాయడానికి వీలుగా ఉంటుందన్నారు. ఇందుకోసం భవన నిర్మాణానికి రూ.12.5 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవి లక్ష్మయ్య, సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపళ్లు, ఎస్కేయూ సూపరింటెండెంట్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌కెయు పిఆర్ఒ కె.రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిఎం జగన్ జన్మదిన వేడుకలు


పెద్దవడుగూరు మండలంలో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ కళాశాలలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో 175 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ పుట్టినరోజును ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో సభ్యుడిలా సంతోషంగా జరుపుకుంటున్నారన్నారు. మూడున్నరేళ్లుగా పేదల జీవితాలు బాగు చేయాలన్న తాపత్రయంతో జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయడాని విధంగా ఇచ్చిన వాగ్ధానాలు నెరవేర్చిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా పరిపాలనలో నూతన ఒరవడి సృష్టిస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అలాగే ఎస్‌కెయు మెయిన్ గేటు వద్ద కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డి, రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవి లక్ష్మయ్య, వైసిపి యూత్ విభాగం అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ బోధనేతర సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రస్తుత బోధనేతర సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, కార్యదర్శి శాంతిలింగం, ఉపాధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నాయకులు, అభిమానులు సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌లు కోసి పంచిపెట్టారు.

డి.హీరేహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి మండల కన్వీనర్ పొన్నూరుస్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు హనుమంతురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, నాయకులు జగదీష్, రాళ్ల తిమ్మారెడ్డి, రహంతుల్లా, శివలింగ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను బుధవారం నియోజకవర్గంలో నిర్వహించారు. ఇందులో భాగంగా యువనేత వై.ప్రణయ్‌రెడ్డి కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అలాగే ఉరవకొండ మండల పరిధిలోని మోపిడిలో సర్పంచి సిద్ధార్థ ఆధ్వర్యంలో, విడపనకల్, వజ్రకరూరు మండలాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, మండల కన్వీనర్ బసన్న, విడపనకల్ పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, సర్పంచులు ఉమాశంకర్, ఎంపిటిసి రాజశేఖర్, ఓబులేసు, డీలర్ రామన్న, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, వైసిపి నాయకులు దేశాయ్ సిద్ధార్థ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : సిఎం జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని అన్ని గ్రామాల సచివాలయాల్లో సిఎం జగన్ జన్మదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడం ద్వారా సిఎం జగన్ చదువుల విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. అలాగే వ్యవసాయ, ఆరోగ్య రంగాలతోపాటు విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది, ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, జెడ్పిటిసి భర్త త్రిలోకరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నాయకులు జి.శ్రీనివాసులు, వీరన్న, కన్వీనర్ శ్రీనివాసులు, సర్పంచి సాలీబాయి, రమనేపల్లి రమేష్, గాంగ్యానాయక్, తిమ్మారెడ్డి, కరుణాకర్, వెంకట్‌రెడ్డి, మారుతీరెడ్డి, బాబూనాయక్, బాబురెడ్డి, నరిగన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు బుధవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.

బుక్కరాయసముద్రం : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న జన్మదిన సంబరాలను ప్రతి ఇంటా ఒక వేడుకలా చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించామన్నారు. మొదటిరోజు జగనన్నకి ఎంతో ఇష్టమైన ఆటల పోటీలు నిర్వహించామన్నారు. రెండో రోజు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తూ మొక్కల పెంపకం చేపట్టామన్నారు. మూడో రోజు రక్తదాన మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ఇక ముగ్గుల పోటీల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అంతకుముందు అభిమానులు ప్రజలు, కార్యకర్తల సమక్షంలో జగనన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జడ్పీ వైస్‌ఛైర్మన్ నాగరత్నమ్మ, భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండల వ్యాప్తంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలను బుధవారం వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పట్టణంలోని గాంధీ కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలవేసి కేకును కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, పండ్లు బ్రెడ్లను పంపిణీ చేశారు. అలాగే ఆర్ఎస్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైస్ ఛైర్‌పర్సన్‌లు పద్మలత, వరలక్ష్మి, ఎంపిపి జి.విశాలాక్షి, వైసిపి మండల ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు హుస్సేన్ పీరా, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, కోనా మురళీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రంగస్వామి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టుగోవిందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని మెట్టు గోవిందరెడ్డి క్యాంపు కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వినాయక కూడలిలో వైసిపి మైనార్టీ నాయకులు షబ్బీర్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు లావణ్య, లక్ష్మి, శారద, పద్మజ, శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు రాజగోపాల్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, శివ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో బుధవారం సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ కొట్టాలపల్లి హరినాథ్‌రెడ్డి, నాయకులు శరబారెడ్డి, చితంబరరెడ్డి, శేషానందరెడ్డి, వెంకటస్వామిగౌడు, రామచంద్రారెడ్డి, లక్షుంపల్లి హరినాథరెడ్డి, ఎంపిపి శ్రీదేవి, మండల ఉపాధ్యక్షుడు కదరగుటపల్లి హరినాథరెడ్డి, పలుశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : సిఎంజగన్ జన్మదిన వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని చిక్కేపల్లిలో ఏర్పాటు చేసిన సచివాలయంతోపాటు విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు అనంతరం వరదాయపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో కేక్‌లు కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, జిల్లా స్టీరింగ్ సభ్యుడు రవిప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, ఉపాధ్యక్షులు బొందలదిన్నె రామయ్య, అమర్నాథ్‌రెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్

రాష్ట్రంలో కొనసాగుతున్న దుర్మార్గపు పాలన

తనకల్లు : రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని చిన్న కడపలవాండ్ల పల్లి, వంకపల్లి, డేగానివారిపల్లి గ్రామాలలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగు యూత్ అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు దేశాయ్ ప్రభాకర్ రెడ్డి, సోంపాళ్యం నాగభూషణ, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, తోట సరోజమ్మ, మహబూబ్ బాషా, మాధవరెడ్డి, జియావుల్లా, దామోదర్, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

కనగాన పల్లి : అసమర్ధ ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం జరిగుతోందని టీడీపీ మండల కన్వనర్ యాతం పోతలయ్య విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని ముక్తాపురం పంచాయతీ పర్వత దేవర పల్లి గ్రామంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ బోయపాటి సుధాకర్, నరసింహ యాదవ్, నరేంద్ర రెడ్డి, నారాయణ స్వామి, దామోదర్ రెడ్డి, ముక్తాపురం కిష్ట తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రంమలో మండల కన్వీనర్ కూచి రాము, నాయకులు హర్షవర్ధన్ గుప్తా. రామానాయుడు, వెంగమ నాయుడు, పాపా నాయుడు, కాడిశెట్టి చలపతి, కొంక సాంబశివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ'లో టిడిపి నాయకులు

ముదిగుబ్బ : అవినీతిలో కూరుకుపోయిన వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని కొండగట్టుపల్లి, మదన్న గారి పల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, నాయకులు తుమ్మల మనోహర్ నాయుడు, నామాల కృష్ణమూర్తి, గడ్డం మోహన, స్టూడియో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : అబద్ధాలతో జనాన్ని నమ్మించి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన జగన్ అన్ని వర్గాల వారిని మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కాలం చెల్లిందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. మండలంలోని చందకచర్ల గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి భూషణ్, పాండురంగప్ప, అరుణ ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : రాష్ట్రంలో వైసిపి దుర్మార్గపు పాలన కొనసాగుతోందని టిడిపి నాయకులు ఆలం నరసానాయుడు విమర్శించారు. బుధవారం మండలంలోని గూగూడు గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు, మాజీ మండలాధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ ఓబుళమ్మ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని గోవిందంపల్లి, చెదుళ్ల గ్రామాల్లోని సచివాలయాలను డిఎల్‌డిఒ ఓబుళమ్మ బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. అనంతరం ఆన్‌లైన్ సర్వీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోష్ణ గారు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు గారు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని పలువార్డుల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో శ్రీ సత్యసాయి మంచినీటి పథకానికి సంబంధించిన పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. వాటిని మరమ్మతులు చేయడానికి నాలుగు రోజులు పడుతుందని, ప్రజలు గమణించి సహకరించాలని కోరారు.

రెగ్యులర్ ఎఇని నియమించండి

గాండ్లపెంట : మండలానికి రెగ్యులర్ ట్రాన్స్‌కో ఎఇని నియమించాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి రెగ్యులర్ ఎఇ లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇన్‌ఛార్జి ఎఇ అందుబాటులో ఉండటం లేదన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రెగ్యులర్ ఎఇని నియమించాలని కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం

నల్లమాడ : మండల పరిధిలోని నల్ల సింగయ్యగారి పల్లి లో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్వగృహం నందు బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్ ప్రారంభించారు. దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23వ తేదీ దాకా ఈ శిబిరం కొనసాగనుంది. నియోజకవర్గ పరిధిలోని వందల సంఖ్యలో వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, డిసిహెచ్‌ఎస్ త్రివేంద్ర నాయక్, చెన్నారెడ్డి, దుద్దుకుంట అపర్ణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.